అరకొర కార్యదర్శులతో అవస్థలు

- పంచాయతీల్లో పాలనాపరంగా ఇబ్బందులు
- ప్రజలకు అందుబాటులో ఉండని వైనం
- ఇన్‌చార్జి వంకతో విధులకు కొందరు డుమ్మా
- పర్యవేక్షణ లేక కుంటుపడుతున్న అభివృద్ధి



చినగాడవిల్లి సచివాలయం

ఉప్పలగుప్తం: 2014 నుంచి 2019 మధ్య కాలంలో గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు అరకొరగా ఉండేవారు. గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిలో భాగంగా 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక నూతన శకానికి నాంది పలికింది. ప్రభుత్వ పథకాల కోసం మండల స్థాయి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పరిపాలనను సులభతరం చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ప్రతి సచివాలయంలో వివిధ శాఖలకు 10 మంది చొప్పున నూతన సిబ్బందిని సచివాలయ ఉద్యోగులుగా నియమించింది. దీనిలో భాగంగా గ్రేడ్‌-5 పంచాయతీ కార్యదర్శులను నియమించి వారిని గ్రేడ్‌-1, గ్రేడ్‌-2 కార్యదర్శుల పర్యవేక్షణలో విధులు నిర్వర్తించేలా కార్యాచరణ రూపొందించింది. దీనికి తోడు గ్రామంలో ప్రతి లబ్ధిదారునికి సంక్షేమం నేరుగా గడప వద్దకు అందేలా ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి గ్రామంలో ఎవరికి ఎటువంటి ప్రభుత్వ పరమైన సేవలు కావాలన్నా వారిద్వారా లబ్ధిదారులకు నేరుగా చేరవేసేది. సచివాలయ వ్యవస్థ దండగని బీరాలు పలికిన కూటమి నాయకులకు ప్రస్తుతం ఈ వ్యవస్థే ఆధారమయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొంతమంది కార్యదర్శులను బదిలీ చేయటంపై కొన్ని గ్రామ సచివాలయాల్లో పూర్తి పరిపాలన బాధ్యత గ్రేడ్‌-5 కార్యదర్శులపై పడింది. మరికొన్ని పంచాయతీల్లో సీనియర్ కార్యదర్శులకు రెండు మూడు పంచాయతీలకు ఇన్‌చార్జ్‌లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఉద్యోగంలో ఆరితేరిన సీనియర్‌లు విధులు నిర్వర్తించాల్సింది పోయి విధులకు గైర్హాజరు అవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యదర్శుల నియామకం చేయాలని వారు కోరుతున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం రూరల్ మండలాలున్నాయి. వీటిలో ఉప్పలగుప్తంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో మేజర్ పంచాయతీలు 5, మైనర్ పంచాయతీలు 12 ఉండగా 10 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. అల్లవరంలో 21 పంచాయతీల్లో మేజర్ 5, మైనర్ 16 ఉండగా కేవలం 14 మంది కార్యదర్శులు ఉన్నారు. అమలాపురం మండలంలో 22 పంచాయతీల్లో మేజర్ 8, మైనర్ 14 పంచాయతీల్లో 15 మంది కార్యదర్శులు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సరైన పర్యవేక్షణ లేక ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోయి పారిశుధ్యం క్షీణిస్తోంది. ప్రతి ఉద్యోగి ఉదయం విధులకు వచ్చినప్పటి నుంచి తిరిగి నివాసాలకు వెళ్లేంత వరకు మూమెంట్ రిజిష్టర్ నిర్వహించాలనే నిబంధన ఉన్నా కొంత మంది ఉద్యోగులకు ఈ విషయం పట్టడం లేదు. ఇప్పటికైనా ప్రతి గ్రామానికి కార్యదర్శిని నియమించి గ్రామంలోనే ప్రజలకు సేవలందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి స్థాయి కార్యదర్శి లేరు



మాది విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి గోకనవిల్లి ప్రాంతం. మా గ్రామానికి పూర్తి స్థాయిలో పంచాయతీ కార్యదర్శి లేరు. ఈ మధ్యకాలంలో మా ప్రాంతంలో ఒక సమస్యపై కార్యదర్శికి విన్నవించుకుందామని చాలాసార్లు పంచాయతీ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదు. ఇలా అయితే సమస్య ఎలా పరిష్కారం అయ్యేది. ఉన్నతాధికారులు స్పందించి మా గ్రామానికి ప్రత్యేక కార్యదర్శిని ఏర్పాటు చేయాలి.

–ముషిణి రాంబాబు, విలసవిల్లి గ్రామం, ఉప్పలగుప్తం మండలం.

గ్రామాభివృద్ధికి విఘాతం



గ్రామానికి కార్యదర్శి లేకుంటే గ్రామాభివృద్ధికి విఘాతం కలుగుతుంది. గ్రామంలో ఏ పని ముందుకు సాగాలన్నా అటు పంచాయతీ పాలకవర్గంతో పాటు ఇటు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. పాలనా వ్యవహారాలు అన్నీ పంచాయతీ కార్యదర్శి సంతకాలతోనే ముందుకు సాగుతాయి. ఇన్‌చార్జ్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతి పంచాయతీకి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా కార్యదర్శులను నియమించాలి.

–పులుసుగంటి రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యురాలు, తుమ్మలపల్లి, అల్లవరం మండలం.

క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ బహూకరణ



సాకుర్రులో వాటర్ ప్యూరిఫయర్‌ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, దాతలు

అమలాపురం రూరల్: సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాతలు వేదుల విశ్వనాథం కుటుంబ సభ్యులు, నక్క సోమేశ్వరరావు దంపతులు, గ్రామ పెద్దలు రూ.75 వేలు విలువైన ప్యూరిఫయర్ వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. శనివారం వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావులు దీనిని ప్రారంభించారు. దాతలకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

11 నుంచి రెవెన్యూ సదస్సులు

తాళ్లరేవు: ఈ నెల 11 నుంచి 28 వరకు గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.త్రినాథరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న చొల్లంగి, చొల్లంగిపేట, 12న జి.వేమవరం, 13న పటవల, 17న కోరంగి, 18న ఇంజరం, 19న పి.మల్లవరం, 20న నీలపల్లి, 21న సుంకరపాలెం, 24న పిల్లంక, 26న లచ్చిపాలెం, 27న ఉప్పంగల గ్రామ సచివాలయాల వద్ద జరుగుతుందన్నారు. 28న తాళ్లరేవు, గాడిమొగ, పోలేకుర్రు గ్రామ పంచాయతీలకు సంబంధించి తాళ్లరేవు అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో సదస్సు జరుగుతుందన్నారు. భూ యజమానులు తమ భూములకు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఈ సదస్సుల ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు.

ఎంబీఏ టాపర్‌గా ఈదరపల్లి విద్యార్థిని



గోల్డ్ మెడల్ సాధించిన శ్రీలక్ష్మి

అమలాపురం రూరల్: ఈదరపల్లికి చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు అడపా బాబులు కుమార్తె అడపా శ్రీలక్ష్మి ఈ ఎకనామిక్ ఏడాదికి గానూ ఎంబీఏ స్టేట్ టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో చదువుతున్న శ్రీలక్ష్మి శనివారం మెడల్ అందుకుంది. యూనివర్సిటీ కన్వెన్షన్ సందర్భంగా వీసీ చేతుల మీదుగా మెడల్ అందుకుంది.

గురుస్వామి పుల్లయ్య నాయుడు మృతి

అమలాపురం రూరల్: ఈదరపల్లి గ్రామానికి చెందిన గురుస్వామి వాసన పుల్లయ్య నాయుడు (75) శనివారం మృతి చెందారు. ఇప్పటి వరకు ఆయన 33 సార్లు మాలధారణ చేసి శబరిమాల అయ్యప్పను దర్శించారు. గురు స్వామిగా ఎంతో మంది శిష్యులను తయారు చేశారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు వున్నారు.

గృహ నిర్మాణ రుణాన్ని రూ.5 లక్షలకు పెంచాలి

అమలాపురం టౌన్: ప్రభుత్వం పేదలకు ఇచ్చే గృహ నిర్మాణ రుణాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సీపీఐ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. అమలాపురంలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన జిల్లా సమాశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం నేత డేగా ప్రభాకర్ మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల్లో అవినీతికి పాల్పడ్డ అదానీని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణ కాండపై ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పటి వరకూ స్పందించక పోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, పార్టీ జిల్లా నాయకులు పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేష్, చెల్లుబోయిన తాతారావు, నల్లి బుజ్జిబాబు తదితరులు ప్రసంగించారు.

యానాం అభివృద్ధికే తొలి ప్రాధాన్యం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, నిధుల సాధనలో ఎన్నో అడ్డంకులు ఎదురైనా తాను ప్రభుత్వంపై పోరాట పంథాను వీడలేదని అభివృద్ధికే జీవితాన్ని అంకితం చేస్తానని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో వివిధ గ్రామాలనుంచి వచ్చిన వందలాది మంది కార్యకర్తలు, అభిమానుల సమావేశంలో మాట్లాడారు. గత నాలుగేళ్ల పాలనలో సుమారు రెండున్నర ఏళ్ల ప్రభుత్వ విధానాలపై అనేక రకాల నిరసన దీక్షలు చేపట్టానన్నారు. ఫ్లడ్‌ప్రోన్ జోన్‌లో ఉన్న బీచ్‌లో వద్ద వందలాది గృహాలు కూల్చివేస్తారనే ప్రచారాన్ని నమ్మవద్దని ఎవరూ భయాందోళన చెందవద్దన్నారు. ఆమరణ నిరాహార దీక్షతో పాటు గత ఏడాది నవంబర్ 5న పుదుచ్చేరి అసెంబ్లీ వద్ద సీఎస్ఆర్ నిధుల కోసం ధర్నా చేసానని దానికి స్పందించిన సీఎం రంగసామి తన డిమాండ్‌లను నెరవేర్చడం వల్లే సీఎస్ఆర్ నిధులు మంజూరయ్యాయన్నారు. సమావేశంలో నాయకులు కాకి నాగేశ్వరరావు, నక్కల సుబ్బన్న, కనకాల నర్సింహమూర్తి, సబ్బతి శ్రీను, ఫిరోజ్, మోదే హరిశ్చంద్ర, లంకే లోవరాజు, కొమ్ము కుమారి పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి యువత పాటు పడాలి



శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: యువత సమాజాభివృద్ధికి పాటు పడాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బెంగళూరుకు చెందిన ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్, అమలాపురం కార్మెంట్ సిస్టర్స్ ఆఫ్ థెరిసా, ముమ్మిడివరం పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ముమ్మిడివరంలో జరిగిన శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో చైర్మన్ పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యం, ప్రభుత్వ పథకాలు, మానవ హక్కులు, వినియోగదారుల హక్కులు, బాల బాలికల హక్కుల గురించి శిక్షణా కార్యక్రమంలో తెలుసుకున్న యువకులు సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు.శిక్షణ పొందిన 40 మంది యువకులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ వడ్డి నాగేశ్వరరావు, రాష్ట్ర కోఆర్డినేటర్ జి.కరుణారావు, పీపుల్స్ అర్గనైజేషన్ అధ్యక్షులు కన్నీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు నిర్దేశకులుగా మారాలి



కామనగరువు అప్పన్నపేట పాఠశాలలో విద్యార్థులతో జేసీ నిషాంతి



అమలాపురంలో మాట్లాడుతున్న డీఈవో సలీమ్ బాషా



గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రసంగిస్తున్న డీఎస్పీ ప్రసాద్

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు జేసీ నిషాంతి సూచన
- ఉత్సాహ వాతావరణంలో ఆత్మీయ సమావేశాలు

అమలాపురం రూరల్: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు ఉంటుందని జేసీ టి.నిషాంతి అన్నారు. కామనగరువు గ్రామ పరిధి అప్పన్నపేట మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు విలువైన విషయాలు బోధించారు. కామనగరువు గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ కలయికలో సర్పంచ్ అరుణ కుమారి మాట్లాడారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. సాకుర్రుగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లులతో సమావేశం నిర్వహించారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఫణీంద్రరావు, మాజీ సర్పంచ్ ములపర్తి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు కే. కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వన్నెచింతలపూడి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. సామూహిక భోజనాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలి

అమలాపురం టౌన్: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు నేర్వాలని, ఆ దిశగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు కృషి చేయాలని డీఈవో షేక్ సలీమ్ బాషా సూచించారు. స్థానిక కొంకాపల్లి జవహర్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో డీఈవో బాషా మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం, జిల్లా సర్వశిక్ష ఏఎంవో ఎంఏకే భీమారావు, స్కూలు పేరెంట్స్ కమిటీ చైర్మన్ వానపల్లి ముక్కోటి రాంబాబు తదితరులు ప్రసంగించారు. పాఠశాల ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు బి.లక్ష్మీతులసి తదితరలు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోవద్దని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సూచించారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దీనితో పాటు చల్లపల్లి, గోపవరం, భీమనపల్లి తదితర గ్రామాల పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. పలు పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువ మంది హాజరవ్వటంతో పలువురు విమర్శిస్తున్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.ఏ షంషి, ఎంపీడీవో పి.రాజ్‌కుమార్, ఎమ్ఈవో 2 సత్తి సత్యకృష్ణ, మండల పరిషత్ ఏవో కె.మూర్తి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని ఎంపీపీ, యూపీ, ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ డే సమావేశాలను నిర్వహించారు. బోడసకుర్రు, అల్లవరం, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలల్లో మండల ప్రత్యేకాధికారి కె.మూర్తి, కోడూరుపాడులో ఎంపీడీఓ కృష్ణమోహన్, దేవగుప్తం, ఎస్.పల్లిపాలెం, ఎంట్రుకోనల్లో ఎంఈఓ కిరణ్‌బాబు ఆధ్వర్యంలో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాలల కొరకు ఆర్థిక వితరణ చేసిన దాతలను అభినందించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, బొమ్ము బాలవేణి, తోట శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు మాకే కృష్ణమూర్తి, ఎస్.మౌనిక, హెచ్‌ఎంలు వేణుగోపాల్, వెంకటేశ్వరరావు, గురుకులం ప్రిన్సిపాల్ ఎస్.సాయిబాబు, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: పట్టణంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమావేశాలు శనివారం జరిగాయి. స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి, కిమ్స్ వైద్య కళాశాలలో సీనియర్ వైద్యుడు గోలకోటి రంగారావును ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలంలో జెడ్పీ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం మెగా పెరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కూల్చివేతకు పాల్పడితే ప్రజాందోళన తప్పదు

యానాం: యానాం గోదావరి తీర ప్రాంత పరిధిలో రాజీవ్ రివర్ బీచ్‌ను ఆనుకుని కొన్నేళ్ల క్రితం నిర్మాణం చేసుకున్న గృహాలను ఫ్లడ్‌ప్రోన్ ఏరియా పేరుతో కూల్చి వేయడానికి నిర్ణయిస్తే ప్రజాందోళన చేపడతానని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్పష్టం చేశారు. శనివారం స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో ఫెర్రీరోడ్డు, ఫ్రాన్స్‌తిప్ప, కెవిఆర్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన నివాస ప్రజలు, వ్యాపారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వ్యాపార సంస్థలను తొలగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసిందని తరువాత ఆ తీర్పు నివాస ప్రాంతాలకేనని కొంత మంది అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఇప్పటికే సీఎస్ఆర్ నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.45 కోట్లతో అక్కడ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రజల ఇళ్లు, వ్యాపార సముదాయాలు కూల్చివేస్తామంటే ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రాఘవులు ఉద్యమ స్ఫూర్తి ఆదర్శనీయం



కమ్యూనిస్టు నేత రాఘవులు వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాగేంద్ర

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన ఉత్తరాంధ్ర జిల్లాల కమ్యూనిస్టు ఉద్యమనేత దివంగత కేవీ రాఘవులు ఉద్యమ స్ఫూర్తి నేటి కమ్యూనిస్ట్ నేతలకు ఆదర్శనీయమని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, సీపీఎం నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. దివంగత రాఘవులు 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు అధ్యక్షతన శనివారం సభ జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి తదితర నాయకులు తొలుత దివంగత రాఘవులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దివంగత రాఘవులు పలు రంగాలకు చెందిన కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించిన ఫలితాలను సభలో వక్తలు తమ ప్రసంగాల్లో గుర్తుచేశారు. కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, పలు కార్మిక సంఘాల నాయకులు రాఘవులు ఉద్యమ ప్రస్థానాన్ని తమ ప్రసంగాల్లో వివరించారు. చివరిగా రాఘవుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాడాలని వర్ధంతి సభ తీర్మానించింది.

‘రీజెన్సీని తరలించమనడం భావ్యం కాదు’

యానాం: 25 ఏళ్లుగా నిరాటకంగా నడిచి యానాం పరిసర ప్రాంతాల్లో వేలాది మంది నిరుద్యోగ యువత ఉపాధికి దోహదపడి కొన్ని కారణాల వల్ల ఉత్పత్తి నిలిచిపోయిన రీజెన్సీ సిరామిక్స్ టైల్స్ భారీ ఫ్యాక్టరీని వేరేచోటకు తరలించమనడం భావ్యం కాదని శనివారం ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు తాను ఎప్పుడూ వాయిదా వేయలేదని పరిశ్రమ మూతపడిన తర్వాత కూడా పరిశ్రమ నడుస్తున్నట్లు లెక్కలు చూపించడం అన్యాయమన్నారు. టైల్స్ పరిశ్రమలో ఉన్న అనుభవం దృష్ట్యా తిరిగి పరిశ్రమను ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్నానన్నారు.

శంభు కుమారా.. హరోం హరా

- భక్తి శ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు
- ఆలయాలల్లో బారులు తీరిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- పలుచోట్ల అన్న సమారాధనలు

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డులో గల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో షష్ఠి మహోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం కన్నుల పండువగా జరిగింది. భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనాన్ని కల్పించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకూ స్వామివార్ల దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. దేవస్థానం ఈవో ఆర్.శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఈవో కార్తీక పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి.

అమలాపురం టౌన్: సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆదిశేష నిలయంలో నాగ సాధన పూజా కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. గౌతమ మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో భక్తులు నాగ ప్రతిష్ఠ, విశేష నాగపూజ, నాగ సాధన పూజాధికాలు నిర్వహించారు. కాలసర్ప, మహా సర్ప, మనసాదేవి మంత్రాలను సాధకులు సామూహికంగా జపించారు. రవణం నరేంద్రకుమార్, కృష్ణవేణి దంపతులు కర్తలుగా భక్తులు నాగ సాధనను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఐ.పోలవరం: కోనసీమలో ప్రసిద్ధి గాంచిన గుత్తినదీవి– వేమవరంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తుల తాకిడి పోటెత్తింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై మల్లికార్జున రెడ్డి సిబ్బందితో పర్యవేక్షించారు. మురమళ్లలో ఉదయం నుంచి భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోడానికి భక్తులు బారులు తీరారు. కొమరగిరి, తిళ్లకుప్ప, కేశనకుర్రుపాలెం, ఐ.పోలవరం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అమలాపురం రూరల్ మండలం ఏ.వేమవరంలో వేంచేసి యున్న వల్లీ దేవసేన సమేత బాల సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు బారులు తీరి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో గల 42 అడుగుల ఎత్తుగల బాల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ విగ్రహాన్ని దర్శించుకునేందుకు భక్తులు మెయిన్ రోడ్డు వరకూ బారులు తీరారు. ఆలయ వ్యవస్థాపకుడు గూడా హరిశ్చంద్రుడు కుటుంబీకులచే స్వామి కల్యాణం నిర్వహించారు. తాలూకా ఎస్సై శేఖర్‌బాబు బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపెల్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. నడిపూడి గ్రామ శివారు మెట్ల రాంజీ కాలనీలో గల పుట్ట సుబ్రహ్మణ్యస్వామికి ప్రజలు పూజలు చేశారు. రంగాపురంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. బండారులంకలో భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి దివ్య కల్యాణం, నిర్వహించారు. జనుపెల్లిలో రుక్మిణీ సమేత మదన గోపాలస్వామి పీఠానికి చెందిన గురుస్వాములు, భవానీల ఆధ్వర్యంలో ఏ.వేమవరంలో బాలసుబ్రహ్మణ్య స్వామికి పానకాల కావడిని సమర్పించారు. దీంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు.

అల్లవరం: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కొమరగిరిపట్నం, బోడసకుర్రు గ్రామాల్లో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం తెల్లవారు జాము నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పుర వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. గుడ్డివానిచింతలో షష్ఠి వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు ప్రాంతాల్లో భారీ తీర్థం నిర్వహించారు. దేవగుప్తంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.



ముమ్మిడివరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

తాళ్లరేవు: సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. స్వామివారి దర్శనానికి తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. తాళ్లరేవు, కేశవపురం, సుంకరపాలెం, జార్జీపేట, సుబ్బారాయుని దిమ్మ ప్రాంతాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లరేవు, సుంకరపాలెం గ్రామాలలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కోరంగి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. తాళ్లరేవులో అర్చకులు కొండవీటి శివరామ కృష్ణ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సుంకరపాలెంలో శుక్రవారం రాత్రి వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ముమ్మిడివరం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి తీర్థ మహోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ముమ్మిడివరంలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, తానేల్లంక, గాడిలంక, కొత్తలంక, అయినాపురం ఆలయాల్లో స్వామి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు.



అమలాపురం రూరల్ ఏ.వేమవరంలో 42 అడుగుల బాల సుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద భక్తులు



మురమళ్ల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



బోడసకుర్రులో భక్తులకు దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



జనుపెల్లిలో రుక్మిణీ సమేత మదన గోపాలస్వామి పీఠం నుంచి పానకాల కావడితో ఊరేగింపుగా వెళుతున్న భవానీలు



అమలాపురంలో నాగ సాధన నిర్వహిస్తున్న అక్షయ పాత్ర ప్రతినిధులు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుంకరపాలెం వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి